సాక్షి విశాఖపట్నం

బుధవారం, 21, మే, 2025



భీమిలి టీడీపీలో అసమ్మతి సెగ 8లో



స్టీల్‌ప్లాంట్‌లో కార్మిక సమ్మె ప్రశాంతం 8లో



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల సమ్మె ప్రారంభం 8లో

చరిత్ర సృష్టించేలా యోగా దినోత్సవం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో డీసీపీలు మేరీ ప్రశాంతి, అజిత వేజెండ్ల

మహారాణిపేట: విశాఖలో జూన్ 21న జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచ రికార్డు స్థాయిలో నిర్వహించాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నందున, దీనిని చారిత్రక కార్యక్రమంగా నిలపాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణపై మంగళవారం జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, బుధవారం నుంచి జూన్ 21 వరకు 'యోగా మాసం' పాటించాలని సూచించారు. ఈ నెల రోజులు జిల్లాలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో యోగా ప్రాక్టీస్ జరగాలన్నారు. బుధవారం ఉదయం 6:30 నుంచి 8 గంటల మధ్య ఆర్కే బీచ్ రోడ్‌లో 1,000 మందితో ప్రాథమిక వేడుకలు ప్రారంభించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే మండల, గ్రామ స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు, శిక్షణలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో డీసీపీలు మేరీ ప్రశాంతి, అజిత వేజెండ్ల, రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్‌తో పాటు జిల్లా అధికారులు, యోగా టీచర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖైదీల సమస్యలు తెలుసుకున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి



ఖైదీల సమస్యలు తెలుసుకొంటున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారాన్ని మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సందర్శించారు. జైలు అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. సన్యాసినాయుడు ఖైదీలు ఉండే బ్యారక్‌లు, పరిసరాలను పరిశీలించి, వారికి కల్పించిన సౌకర్యాలు, వైద్యం, భోజన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలు సమావేశ మందిరంలో ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను విన్నారు. ఏ కేసుల్లో జైలుకు వచ్చారు, ఎప్పటి నుంచి రిమాండ్‌లో ఉన్నారు అనే వివరాలను తెలుసుకొని, వారికి అవసరమైన న్యాయ సహాయం గురించి వివరించారు. ఖైదీలు మంచి నడవడికతో ఉండాలని, విడుదలయ్యాక బాహ్య ప్రపంచంలో మంచి ప్రవర్తన కలిగి ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి ఎం.మహేష్ బాబు, ఉప పర్యవేక్షణాధికారులు ఎస్.సాయిప్రవీణ్, సీహెచ్.సూర్యకుమార్, జైలర్లు, డీఎల్‌ఎస్‌ఏ సిబ్బంది పాల్గొన్నారు.



● కుమ్మేసిన వాన

నగరంలోని సోమవారం అర్ధరాత్రి, మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. రైల్వే స్టేషన్ రోడ్డు, దాబాగార్డెన్స్, రైల్వే న్యూకాలనీ, దొండపర్తి, చావులమదుం, అక్కయ్యపాలెం, వెలంపేట, పూర్ణామార్కెట్, ఆశీలమెట్ట, కంచరపాలెం, ఎన్‌ఏడీ కొత్త రోడ్డు, పాతపోస్టాఫీసు, సీతమ్మధార, కేఆర్‌ఎం కాలనీ, మద్దిలపాలెం వంటి అనేక ప్రాంతాల్లోని వీధులు నీటమునిగాయి.

8లో



రుషికొండ బీచ్ మంగళవారం భారీగా కోతకు గురైంది. పెద్ద ఎత్తున దూసుకువచ్చిన కెరటాల ధాటికి తీరం కుంగిపోవడంతో పాటు, సముద్రం ముందుకు చొచ్చుకు వచ్చింది. దీంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎప్పటికప్పుడు మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మెరైన్ పోలీసులు, లైఫ్ గార్డ్స్ పర్యాటకులను అప్రమత్తం చేస్తున్నారు. -కొమ్మాది

నగరంలో రౌడీ రాజ్యం..!

కూటమి ప్రభుత్వంలో రెచ్చిపోతున్న రౌడీషీటర్లు

విశాఖలో సుపారీ గ్యాంగ్‌లు.. సెటిల్‌మెంట్లు.. దందాలు..

ఒకప్పుడు ప్రశాంతంగా ఉన్న విశాఖ నగరం ప్రస్తుతం రౌడీలకు అడ్డాగా మారింది. సెటిల్‌మెంట్లు, దందాలకు కేంద్రమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో రౌడీషీటర్లు రెచ్చిపోతున్నారు. శివారు ప్రాంతాలతో పాటు నగర నడిబొడ్డులో కూడా కిడ్నాప్‌లు, భూ దందాలతో పేట్రేగిపోతున్నారు. ఇటీవలి కాలంలో భీమిలి, లాసెన్స్ బే కాలనీలో జరిగిన వరుస ఘటనలతో విశాఖవాసులు భయాందోళనకు గురవుతున్నారు.



- మొన్న మంగమారిపేటలో వాచ్‌మన్‌ను కిడ్నాప్ చేసి భూకబ్జాకు ప్రయత్నం
- నిన్న లాసెన్స్ బే కాలనీలో ఆశ్రమాన్ని ఖాళీ చేయాలని నిర్వాహకులకు బెదిరింపులు
- కొంతమందికి రాజకీయ నేతల అండదండలు
- సంఘటన జరిగినప్పుడే పోలీసుల హడావుడి
- వరుస ఘటనలతో హడలిపోతున్న ప్రజలు

విశాఖ సిటీ: ప్రశాంత విశాఖలో సుపారీ గ్యాంగ్‌లు అలజడి సృష్టిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు హడావుడి చేయడం మినహా వీరిని పూర్తి స్థాయిలో కట్టడి చేయడంలో పోలీసులు విఫలమవుతున్నా రన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విశాఖపట్నంలో సుపారీ గ్యాంగ్‌ల ఆగడాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ నెలలోనే జరిగిన రెండు ఘటనలు జిల్లాలో పరిస్థితులకు అద్దం పడుతున్నాయి.



కూటమి పంచన రౌడీషీటర్లు?

విశాఖపట్నం నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 650 మంది రౌడీషీటర్లు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ప్రస్తుతం నగరంలో 350 మంది వరకు ఉండగా, పోలీసు రికార్డుల ప్రకారం 170 మంది యాక్టివ్‌గా ఉన్నారు. ముఖ్యంగా పెందుర్తి, విశాఖ దక్షిణం, గాజువాక, భీమిలి నియోజకవర్గాల పరిధిలో రౌడీషీటర్ల ప్రభావం ఎక్కువగా ఉంది. వీరు నిరంతరం ఏదో ఒక అలజడి సృష్టిస్తూనే ఉన్నారని, ప్రాణనష్టం జరిగిన కేసులు మినహా మిగిలినవి బయటకు రావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్లలో 40 మంది వరకు నగరంలోని కూటమి ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల అండదండలతో ఉన్నట్లు సమాచారం. అవసరమైనప్పుడు బెదిరింపులు, సెటిల్‌మెంట్ల కోసం నాయకులు వీరిని వాడుకుంటున్నారని, వీరు చేసే ఆగడాలు బయటకు రాకుండా చూసుకుంటున్నారని బహిరంగ చర్చ జరుగుతోంది.

భీమిలి ఘటన: భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగమారిపేటలో ఒక ఎన్‌ఆర్‌ఐ స్థలాన్ని కబ్జా చేసేందుకు రౌడీ మూకలు అలజడి సృష్టించాయి. ఒక గ్యాంగ్ స్థలంలో ఉన్న వాచ్‌మన్‌ను కిడ్నాప్ చేసి బీచ్ రోడ్డులో తిప్పుతుండగా, మరికొందరు ఆ భూమి ప్రహరీ గోడను పడగొట్టి నిమిషాల్లోనే శిథిలాలను తరలించారు. ఈ ఘటన నగరంలో సంచలనం రేపింది.

లాసెన్స్ బే కాలనీలో: తాజాగా లాసెన్స్ బే కాలనీలో ఉన్న ఒక ఆశ్రమ భూ వివాదంలో రౌడీషీటర్ల గ్యాంగ్ తలదూర్చి నిర్వాహకులపై బెదిరింపులకు పాల్పడింది. ఆ ఆశ్రమాన్ని ఖాళీ చేయించడానికి పెద్ద మొత్తంలో సుపారీకి ఒప్పందం జరిగినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.





గతంలో: కొద్ది నెలల క్రితం పెందుర్తిలో ఒక రౌడీషీటర్ వివాహితను ఆటోలో కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించడం, వన్‌టౌన్‌లో ఒక యువకుడిని 18 కత్తిపోట్లతో హత్య చేసిన ఘటన వంటివి గత ఆరు నెలల్లో రౌడీషీటర్లు నగరంలో అనేక అరాచకాలకు తెగబడ్డారని స్పష్టం చేస్తున్నాయి. ఈ వరుస ఘటనలు నగర ప్రజల్లో భయాన్ని రేకెత్తిస్తున్నాయి.

రాజకీయ అండదండలతో..

నగరంలో పలువురు రౌడీషీటర్లకు కూటమి నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయని తెలుస్తోంది. సాధారణంగా యాక్టివ్‌గా ఉండే రౌడీషీటర్లు ప్రతిరోజు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. అయితే, కొంతమంది రౌడీషీటర్లు తమకు సన్నిహితంగా ఉండే రాజకీయ నేతలతో పోలీసులపై ఒత్తిడి చేయించి రోజువారీ హాజరు నుంచి మినహాయింపు పొందుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ నేతలే స్వయంగా ఫోన్ చేసి ఆదేశించడంతో పోలీసులు రౌడీషీటర్ల జోలికి వెళ్లడం లేదని వార్తలు వినిపిస్తున్నాయి. ఫలితంగా పోలీసులు వీరిని పూర్తిస్థాయిలో కట్టడి చేయలేకపోతున్నారన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితి నగరంలో శాంతిభద్రతలకు సవాలుగా మారింది



ల్యాండ్ సెటిల్‌మెంట్ల దందా

విశాఖలో పలువురు రౌడీషీటర్లను రాజకీయ నా యకులు, రియల్టర్లు పెంచి పోషిస్తున్నారని, వీరి ద్వారానే భూ దందాలకు పాల్పడుతున్నారని తెలుస్తోంది. ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా అక్కడ నకిలీ రికార్డులు సృష్టించడం, ప్రహరీలను తొలగించి కబ్జాలకు పాల్పడటం సర్వసాధారణంగా మారిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిజమైన యజమానులు తమ భూమికి ఆధారాలు చూపించినా, అది సివిల్ వ్యవహారం అంటూ రెవెన్యూ అధికారులు, పోలీసులు తప్పించుకుంటున్నారని బాధితులు వాపోతున్నారు. కోర్టుకు వెళ్లి తేల్చుకోవాలని లేదా వారితో ఒక ఒప్పందానికి రావాలని ఉచిత సలహాలు ఇస్తున్నారని, దీంతో బాధితులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని తెలుస్తోంది..

ఐసెట్‌లో మెరిసిన మనోళ్లు

- విశాఖ జిల్లాకే నంబర్‌వన్ ర్యాంక్
- టాప్‌టెన్‌లో ఉమ్మడి జిల్లాలో ముగ్గురికి చోటు
- రాష్ట్రంలో విశాఖ నుంచే అత్యధిక మంది హాజరు

విశాఖ విద్య: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశ పరీక్ష ఐసెట్-2025 ఫలితాల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ ఏడాది మొత్తం 32,719 మంది ఐసెట్‌లో ఉత్తీర్ణత సాధించగా, విశాఖ జిల్లాకు చెందిన మేక మనోజ్ రాష్ట్రంలోనే నంబర్ వన్ ర్యాంకు సాధించి, రెండు తెలుగు రాష్ట్రాల్లో విశాఖ ఖ్యాతిని ఇనుమడింపజేశాడు.

టాప్-10లో ముగ్గురు విశాఖ వాసులే..

టాప్-10 ర్యాంకుల్లో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు చోటు దక్కించుకోవడం విశేషం. అనకాపల్లి జిల్లాకు చెందిన షేక్ బషీరున్నీషా 6వ ర్యాంకు సాధించగా, పెదగంట్యాడ మండలంలోని శరగడ గణేష్ రెడ్డి 9వ ర్యాంకును సొంతం చేసుకున్నాడు.

అధిక సంఖ్యలో బాలికల ఉత్తీర్ణత

ఐసెట్ పరీక్షకు అనకాపల్లి జిల్లా నుంచి 169 మంది హాజరుకాగా, వారిలో 167 మంది అర్హత సాధించారు. ఉత్తీర్ణులైన వారిలో 120 మంది బాలికలు ఉన్నారు. అదే విధంగా, విశాఖపట్నం జిల్లా నుంచి 4,397 మంది పరీక్ష రాయగా, వీరిలో 4,303 మంది క్వాలిఫై అయ్యారు. విశేషమేమిటంటే, ఉత్తీర్ణులైన వారిలో 2,377 మంది బాలికలు ఉండటం గమనార్హం. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల పట్ల బాలికలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని దీని ద్వారా తెలుస్తోంది.

అత్యధిక హాజరు విశాఖ నుంచే

రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి ఐసెట్‌కు హాజరైన విద్యార్థుల్లో విశాఖ నుంచే అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పరీక్షకు హాజరుకావడం మరో విశేషం. ఇది జిల్లాలో విద్యాభ్యాసం పట్ల ఉన్న ఆసక్తిని, ఉన్నత విద్యపై విద్యార్థులకున్న ఆకాంక్షను స్పష్టం చేస్తోంది.

శభాష్ గణేష్‌రెడ్డి



శరగడ గణేష్‌రెడ్డి (9వ ర్యాంక్)

పెదగంట్యాడ: ఆంధ్ర యూనివర్సిటీలో నిర్వహించిన ఏపీ ఐసెట్-2025 ఫలితాల్లో మండలంలోని పెదకోరాడ గ్రామానికి చెందిన విద్యార్థి శరగడ గణేష్‌రెడ్డి 9వర్యాంకు సాధించి సత్తాచాటాడు. పెదకోరాడకు చెందిన శరగడ ఎల్లయ్యరెడ్డి, వెంకటలక్ష్మి దంపతుల కుమారుడు గణేష్‌రెడ్డి ఈ ఘనత సాధించాడు. ఈ సందర్భంగా గణేష్‌రెడ్డి మాట్లాడుతూ, ఎంబీఏ పూర్తి చేసి మార్కెటింగ్ రంగంలో స్థిరపడతానని తన లక్ష్యాన్ని వెల్లడించాడు. అతని ప్రతిభకు గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

ట్రాన్స్‌ఫర్మేటివ్ క్లైమేట్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష



మేయర్‌తో వివిధ వర్సిటీల ప్రతినిధులు

దాబాగార్డెన్స్: నగరంలో విపత్తులు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్ట నివారణకు చేపట్టే చర్యలపై యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ(యూఎన్‌యూ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్(ఎన్‌ఐయూఏ), ది ఎనర్జీ అండ్ రిసోర్స్ ఇన్‌స్టిట్యూట్(టీఈఆర్‌ఐ) ప్రతినిధులు నగర మేయర్ పీలా శ్రీనివాస్‌ను మంగళవారం కలిసి వివరించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్లో ఆయా సంస్థల ప్రతినిధులు ట్రాన్స్‌ఫర్మేటివ్ క్లైమేట్ యాక్షన్ ప్లాన్ ఆవశ్యకతను తెలిపారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో కలిగే విపత్తులు, వడగాల్పులు, వరదలు తదితర వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల సహకారంతో నష్ట నివారణ ఎలా తగ్గించుకోవచ్చో వివరించారు.

ఉప మేయర్‌గా దల్లి ఏకగ్రీవం

- మేయర్ చాంబర్లో దాచిపెట్టి మరీ.. సభ్యుల్ని తీసుకొచ్చారు!
- సోమవారంనాటి పరాభవంతో ముందుజాగ్రత్త
- పనిచేసిన బుజ్జగింపులు, తాయిలాలు?

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ఉప మేయర్‌గా కూటమి తరఫున జనసేన కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియకు ప్రిసైడింగ్ అధికారిగా జేసీ మయూర్ అశోక్ వ్యవహరించారు. బీ ఫారం అందుకున్న గోవిందరెడ్డికి పోటీగా మరెవరైనా ఉన్నారా? అని అడుగుతూ, ఎన్నికల నియమ నిబంధనలను వివరించారు. ఎవరూ పోటీ లేకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. గోవిందరెడ్డిని ఉప మేయర్‌గా టీడీపీ నుంచి పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, బీజేపీ నుంచి ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ప్రతిపాదించారు. పోటీ లేకపోవడంతో ఎన్నికల అధికారి గోవిందరెడ్డికి నియామక పత్రం అందించారు. అనంతరం ప్రమాణస్వీకారం చేయించారు.

అంతా.. పావుగంట లోపే..

ఉదయం 10.55 గంటలకు నలుగురు ఎమ్మెల్యేలు(జనసేన నుంచి పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, బీజేపీ నుంచి విష్ణుకుమార్‌రాజు, టీడీపీ నుంచి గణబాబు), వివిధ పార్టీలకు చెందిన 41 మంది కౌన్సిల్ సభ్యులు సభకు హాజరయ్యారు. 11 గంటలకు ఎన్నికల అధికారి మయూర్ అశోక్ చేరుకున్నారు. ఆ సమయంలోనే మరో ఇద్దరు ఎమ్మెల్యేలు(కొణతాల రామకృష్ణ, వెలగపూడి రామకృష్ణబాబు) వచ్చారు. తర్వాత 5 నిమిషాలకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో ఇంకో 11 మంది కార్పొరేటర్లు కౌన్సిల్ హాల్‌కు చేరుకున్నారు. దీంతో సభ్యుల సంఖ్య 59కి చేరింది. ఈలోగా ఎన్నికకు సంబంధించి నియమ నిబంధనలు వివరించారు. మరో 8 నిమిషాల్లో ఉప మేయర్ ఎన్నిక తంతు పూర్తి చేశారు.

ముందు జాగ్రత్త!

ఉప మేయర్ ఎన్నికలో సోమవారం నాటి సీన్ రిపీట్ కారాదని జాగ్రత్త పడ్డారు. అసంతృప్త సభ్యుల్ని ముందుగానే రప్పించి మేయర్ చాంబర్లో కూర్చోబెట్టారు. మేయర్ పీలా శ్రీనివాసరావు తన చాంబర్ నుంచి లిస్ట్ ప్రకారం టిక్ పెట్టి మరీ సభ్యుల్ని కౌన్సిల్ హాల్లోకి పంపారు. ముందు రోజు డుమ్మాకొట్టిన వారికి బుజ్జగింపులు, తాయిలాలు అందినట్లు సమాచారం.



దల్లి గోవిందరెడ్డిని అభినందిస్తున్న నగర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

యాదవ, కాపులకు వెన్నుపోటు

జీవీఎంసీ మేయర్, ఉప మేయర్ ఎన్నికల్లో యాదవ, కాపు సామాజిక వర్గాలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని ఆ సామాజిక వర్గ కార్పొరేటర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేయర్‌గా గొలగాని హరివెంకట కుమారి(యాదవ), ఉప మేయర్‌గా జియ్యాని శ్రీధర్(కాపు)లకు అవకాశం ఇచ్చారు. కౌన్సిల్లో బలం లేకపోయినా దొడ్డిదారిన వారిని దించేసిన కూటమి నేతలు, విశాఖలో కూటమి మనుగడకు కారణమైన ఈ రెండు వర్గాలను విస్మరించడంపై ఆయా సామాజిక వర్గాలు ఆగ్రహంగా ఉన్నాయి.

● తల్లీబిడ్డ అవస్థలు





అమ్మైన ఆ సంతోషం కళ్లల్లో నిండాలి. పసిబిడ్డను అక్కున చేర్చుకొని, ప్రభుత్వ వాహనంలో సురక్షితంగా ఇంటికి చేరుకోవాలి. కానీ తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల సమ్మె ఆ ఆశలపై నీళ్లు చల్లింది. వాహనాలు నిలిచిపోవడంతో బాలింతలు అవస్థలు పడ్డారు. మంగళవారం కేజీహెచ్‌లో డిశ్చార్జ్ అయిన చోడవరం ఎడ్లవీధికి చెందిన సౌందర్య జ్యోతికి కూడా అదే పరిస్థితి ఎదురైంది. బిడ్డతో ఆటోలో ఇంటికి వెళుతున్న ఈ దృశ్యం, సమ్మె కారణంగా సాధారణ పౌరులు ఎదుర్కొంటున్న కష్టాలకు అద్దం పట్టింది. సౌందర్య జ్యోతి ఒక్కరే కాదు, ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వెళ్లాల్సిన ఎంతో మంది తల్లులు, పసిబిడ్డలతో కలిసి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారి ఆశలకు భంగం కలిగి, ప్రభుత్వ సేవలు అందక, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

-మహారాణిపేట/ -ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

వర్షాలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం

మహారాణిపేట: వాతావరణంలో మార్పుల కారణంగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజలకు సహాయం అందించేందుకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూమ్ మంగళవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు, 24 గంటలు పనిచేస్తుందని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌వో) బీ.హెచ్. భవానీ శంకర్ మంగళవారం తెలిపారు. అత్యవసర సహాయం కోసం ప్రజలు 0891-2590100 , 0891-2590102 నంబర్లను సంప్రదించవచ్చు.

ఉపాధ్యాయుల బదిలీలకు వేళాయే

- నేటి నుంచి దరఖాస్తుల ప్రక్రియ
- జాబితాలు సిద్ధం చేసిన విద్యాశాఖాధికారులు

విశాఖ విద్య: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియకు తెరలేచింది. బుధవారం నుంచి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల (హెచ్‌ఎంల) బదిలీల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. ప్రేమ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనతో విద్యాశాఖలో బదిలీల సందడి ప్రారంభమైంది. తొలుత గ్రేడ్-2 హెచ్‌ఎంల బదిలీలకు అనుమతి లభించింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఒకే పాఠశాలలో ఐదేళ్లకు పైగా

మిగతా 8వ పేజీలో ▶

ఉపాధ్యాయుల బదిలీలకు వేళాయే..

▶7వ పేజీ తరువాయి

పనిచేస్తున్న హెచ్‌ఎంలకు తప్పనిసరి బదిలీ వర్తిస్తుంది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు జాబితాను సిద్ధం చేశారు. బదిలీల కోసం మొత్తం 88 ఖాళీలను చూపించారు. వీటిలో ఖాళీగా ఉన్న పోస్టులతో పాటు, విదేశీ సేవలకు వెళ్లిన వారు, ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారి పోస్టులు ఉన్నాయి. అంతేకాకుండా, రెండేళ్లకు పైగా ఒకే చోట సర్వీసు పూర్తి చేసుకున్న హెచ్‌ఎంలు కూడా తమకు కావాల్సిన చోటుకు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోనున్నారు.బదిలీల ప్రక్రియ ప్రారంభం కావడంతో జిల్లా విద్యాశాఖ యంత్రాంగం ఈ పనిలో పూర్తిగా నిమగ్నమైంది. మంగళవారం రాత్రి 10 వరకు కూడా డీఈవో ఎస్.ప్రేమ్ కుమార్ కార్యాలయంలోనే ఉండి, జాబితాలపై కసరత్తు చేశారు. రాష్ట్ర స్థాయిలో ఉపాధ్యాయ సంఘాలతో మంగళవారం జరిగిన చర్చల ఫలితంగా ప్రభుత్వం ఓ మెట్టుదిగి, బదిలీ నిబంధనల్లో మార్పులకుసిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈసారి గతంలో ఎన్నడూ లేనివిధంగా 4,811 పోస్టులు ఖాళీల జాబితాలో చూపించారు. దీంతో ఈసారి భారీగానే బదిలీలు జరుగుతాయని ఉపాధ్యాయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా మిగులు (సర్‌ప్లస్) ఉపాధ్యాయులు ప్రస్తుతం పనిచేసే చోటు నుంచి మరోచోటుకు వెళ్లాల్సి ఉంటుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బదిలీలను పారదర్శకంగా చేపట్టేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని డీఈవో ప్రేమ్ కుమార్ తెలిపారు.

నేడు మంత్రి నారాయణ సమీక్ష

విశాఖ సిటీ: విశాఖ నగరాభివృద్ధిపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ బుధవారం ఉదయం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించనున్నారు. జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. మాస్టర్‌ప్లాన్‌తో పాటు భవిష్యత్తు ప్రాజెక్టులు, ఇతర ప్రణాళికలపై చర్చించనున్నట్లు వీఎంఆర్‌డీఏ వర్గాలు వెల్లడించాయి.

స్టీల్‌ప్లాంట్‌లో కార్మిక సమ్మె ప్రశాంతం

- బైక్ ర్యాలీకి యత్నం
- పోలీసుల అదుపులో కార్మిక నాయకులు


స్టీల్‌ప్లాంట్ వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో మంగళవారం జరిగిన కార్మిక సమ్మెలో ఆరుగురు కార్మిక సంఘ నాయకుల్ని పోలీసులు అదుపులోకి తీసుకోవడం మినహా ప్రశాంతంగా జరిగింది. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు సక్రమంగా జీతాల చెల్లింపు, హెచ్‌ఆర్‌ఏ పునరుద్ధరణ, కరెంట్ చార్జీల తగ్గింపు, సొంత గనుల కేటాయింపు తదితర డిమాండ్లపై శాశ్వత కార్మికులు ఒక రోజు సమ్మె చేశారు. ఇక కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలని, తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, పాత పద్ధతిలో అందరికీ ఎస్ఎంఏ, ఏఎస్ఎంఏలను చెల్లించాలని తదితర డిమాండ్లపై కాంట్రాక్ట్ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు. కాంట్రాక్ట్ కార్మికుల షిఫ్ట్ వేళల్లో ప్లాంట్ లోపలికి వెళ్లినప్పటికీ, గేట్ల వద్ద బయోమెట్రిక్ నమోదు చేయించుకోలేదు. షిఫ్ట్–ఎలో కొంత మంది విధులకు హాజరైనప్పటికీ ఆ తర్వాత కొంత మంది కార్మికులు వారికి నచ్చచెప్పి విధుల నుంచి బయటకు తీసుకు వెళ్లిపోయారు.

పోలీసుల అదుపులో కార్మిక నాయకులు

సెంట్రల్ స్టోర్స్ నుంచి కూర్మన్నపాలెం టెంట్ వరకు బైక్ ర్యాలీగా వెళ్లేందుకు కార్మికులు ప్రయత్నించగా పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు నమ్మి రమణ, యు.సోమేష్, అప్పలరాజు, వంశీ, బి.అప్పారావు, ఉరుకూటి అప్పారావులను జీపులో ఎక్కించి స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేయనున్నట్లు సీఐ కేశవరావు తెలిపారు.

అధిక శాతం విధులకు హాజరు

ఇదిలా ఉండగా శాశ్వత ఉద్యోగులు రెండు షిఫ్టులలో 85–90 శాతం వరకు విధులకు హాజరు కాగా, కాంట్రాక్ట్ కార్మికులు 60–70 శాతం హాజరయ్యారు. సర్వీసు విభాగాలకు చెందిన కాంట్రాక్ట్ కార్మికులు ఎక్కువగా విధులకు హాజరు కాగా, కొన్ని ఉత్పత్తి విభాగాలకు చెందిన కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో గైర్హాజరయ్యారు. ఉత్పత్తికి అంతరాయం కలగకుండా యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది.

పెద్ద ఎత్తున పోలీసుల మోహరింపు

కార్మికుల సమ్మె సందర్భంగా పోలీసులను పెద్ద ఎత్తున మోహరించారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ నేతృత్వంలో ఇద్దరు ఏసీపీలు, తొమ్మిది మంది సీఐలు, 19 మంది ఎస్ఐలతో పాటు సుమారు 500 మంది సిబ్బందిని ఆయా గేట్ల వద్ద, ఈడీ(వర్క్స్) బిల్డింగ్, అడ్మిన్ బిల్డింగ్, సెంట్రల్ స్టోర్స్ కూడలితో పాటు అన్ని ముఖ్య విభాగాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. విధులకు వెళ్లే కార్మికులను సమ్మె చేస్తున్నవారు అడ్డుకోకుండా చర్యలు చేపట్టారు.

సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు అన్నారు. ఇప్పటికే వందలాది మందిని తొలగించడంతో వారు రోడ్డున పడ్డారన్నారు. వారి కుటుంబాలను కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.

దంచి కొట్టిన వర్షం

వర్షం తగ్గాక చుర్రుమన్న ఎండలు


జ్ఞానాపురం వద్ద ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న స్థానికులు


చావులమదుం వద్ద మొరాయించిన కారు

మహారాణిపేట: పగలంతా భానుడి తీవ్రతకు తోడు.. గాలిలో తేమ కారణంగా ఉక్కబోత. సాయంత్రానికి కాస్త మబ్బులు పట్టిన ఆకాశం. అర్ధరాత్రి దాటాక దంచికొట్టిన వాన. ఇదీ సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు నగరంలో వాతావరణ పరిస్థితి. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దాదాపు రెండు గంటలపాటు ఉరుములు మెరుపులతో కూడిన హోరు వాన నగరాన్ని ముంచెత్తింది. కాసేపు విరామమిచ్చి మళ్లీ కురిసింది. మంగళవారం ఉదయం కూడా ఇదే పరిస్థితి. వర్షం తగ్గాక.. ఉదయం 9 గంటల నుంచి మళ్లీ ఎండలు షరామామూలే.

ఉక్కబోత వాతావరణం

గత కొద్ది రోజులుగా ఉదయం పూట ఎండ తీవ్రత వల్ల విశాఖ వాసులు తీవ్ర ఉక్కపోతకు గురవుతున్నారు. వర్షం కురిసిన తర్వాత కూడా ఎండ వచ్చాక, అదే పరిస్థితి. బంగాళాఖాతంలో రుతుపవనాలు, అల్పపీడనం, పశ్చిమ, నైరుతి నుంచి వీస్తున్న గాలుల వల్ల వర్షాలు పడుతున్నట్లు వాతావరణ అధికారులు చెబుతున్నారు.

నగరంలో కురిసిన వర్షపాతం

ప్రాంతం	వర్షపాతం (మి.మీ.)	ప్రాంతం	వర్షపాతం (మి.మీ.)
విశాఖ రూరల్	72.4	భీమునిపట్నం	26.2
సీతమ్మధార	65.0	ఆనందపురం	24.6
మహారాణిపేట	38.2	పెదగంట్యాడ	18.6
గోపాలపట్నం	29.4	గాజువాక	18.6
		పద్మనాభం	10.4
		పెందుర్తి	4.8

లోతట్టు ప్రాంతాలు జలమయం

భారీ వర్షంతో నగరంలో చాలా ప్రాంతాలు జలమయం అయ్యాయి. జ్ఞానాపురం రైల్వే వంతెన వర్షపు నీటితో నిండిపోయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పూర్ణామార్కెట్ ఏరియాలో పలు ప్రాంతాల్లో గంటల తరబడి నీరు నిలిచిపోయింది. ఇక్కడే ఓ రోడ్డు కుంగిపోయింది. రైల్వే స్టేషన్ రోడ్డు, డాబాగార్డెన్స్, రైల్వే న్యూకాలనీ, దొండపర్తి, చావులమదుం అక్కయ్యపాలెం, వెలంపేట, పూర్ణామార్కెట్, ఆశీలమెట్ట, కంచరపాలెం, ఎస్‌పీడీ కొత్తరోడ్డు, పాతపోస్టాఫీసు, సీతమ్మధార, కేఆర్‌ఎం కాలనీ, మద్దిలపాలెం తదితర ప్రాంతాల్లో చాలా వీధులు జలమయమయ్యాయి. ఆర్టీసీ కాంప్లెక్స్, వైఎస్సార్ సెంట్రల్ పార్కు వద్దనున్న నైట్ ఫుడ్ కోర్టులో వర్షపు నీరు భారీగా చేరింది.

సారా బట్టీలపై దాడులు

ఎటపాక: నవోదయం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర సరిహద్దు ప్రాంతం ఎటపాక మండలంలో సారా తయారీ కేంద్రాలపై తెలుగు రాష్ట్రాల ఎక్సైజ్, పోలీసు అధికారులు దాడులు నిర్వహించారు. విశాఖ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి ఆదేశాలతో మండలంలోని పిచుకలపాడు, గుండువారిగూడెం గ్రామాల్లో ఎక్సైజ్, సివిల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు మంగళవారం ఆకస్మికంగా దాడులు జరిపాయి. దాడుల్లో బెల్లం ఊట, సారా సీజ్ చేసి, ఐదుగురిపై కేసులు నమోదు చేశారు.

వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్తగా మొల్లి



ఆరిలోవ: విశాఖ తూర్పు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు మొల్లి అప్పారావు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అధిష్టానం ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గ పరిధి మద్దిలపాలేనికి చెందిన ఆయన పార్టీలో ప్రారంభం నుంచి సేవలు అందిస్తున్నారు. ఆయన భార్య మొల్లి లక్ష్మి 16వ వార్డు నుంచి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్‌గా ఉన్నారు. ఆయన్ని సమన్వయకర్తగా నియమించడంపై పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో పార్టీ మరింత అభివృద్ధి సాధించేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన పార్టీ అధినేత జగన్‌కు, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల సమ్మె ప్రారంభం

బీచ్‌రోడ్డు: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే యూనియన్‌తో చర్చలు జరిపి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ యూనియన్ సీఐటీయూ నాయకులు రాజులు, సతీష్ డిమాండ్ చేశారు. గాంధీ విగ్రహం వద్ద మంగళవారం నుంచి తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చట్ట ప్రకారం నెలకు రూ.18,500 వేతనంగా ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.7,870 వేతనం ఇవ్వడం చాలా అన్యాయం అన్నారు. ఇస్తున్న ఈ కొద్దిపాటి వేతనం కూడా గత నాలుగు నెలలుగా చెల్లించలేదని వారు గుర్తు చేశారు.యూనియన్ లేవనెత్తిన ఉద్యోగ భద్రత, సెలవులు, కనీస వేతనం, ఎనిమిది గంటల పని దినం, ఇన్సూరెన్స్, బళ్ళ రిపేర్లు, సెల్ ఫోన్లు, సెల్‌ఫోన్ రీఛార్జ్‌లు వంటి అనేక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు. తల్లికి బిడ్డకి ఎంతో ఉపయోగపడే ఈ 102 సర్వీస్‌ను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అరబిందో సంస్థ చేస్తున్న వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లాలో ఉన్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లందరూ పాల్గొన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షురాలు మణి సీఐటీయూ నుంచి హాజరయ్యారు.

36 గంటల్లో హత్య కేసు నిందితుల అరెస్ట్

ఏడుగురు నిందితులకు రిమాండ్


మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణు స్వరూప్, చిత్రంలో సీఐ మల్లికార్జునరావు

పరవాడ: ముత్యాలమ్మపాలెంలో ఈ నెల 18న మైలపల్లి బంగారాజుపై కత్తులు, రాళ్లతో దాడి చేసి, హతమార్చిన నిందితులను 36 గంటల వ్యవధిలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

అదే గ్రామానికి చెందిన ముద్దాయి చింతకాయల ఎర్రయ్య, మృతుడు బంగారాజు వద్ద గతంలో రూ.63 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఆ మొత్తం నుంచి రూ.45 వేలు చెల్లించి, ఇంకా రూ.18 వేలు బాకీ ఉన్నాడు. ఈ విషయమై ఎర్రయ్యను పలుమార్లు బంగారాజు అడిగాడు. అంతే కాకుండా అందరికీ చెప్తూ తనను అబాసుపాల్జేస్తున్నాడని ముద్దాయి కోపంతో మృతుడిపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 18న రాత్రి 9.30 సమయంలో పథకం ప్రకారం ప్రథమ ముద్దాయి కొవిరి కామేష్, కొవిరి శివాజీ, కొవిరి ముత్యాలు(ఆర్మీ), చింతకాయల ఎర్రయ్య, కొవిరి ముత్యాలు, వాసుపల్లి ప్రవీణ్‌కుమార్, కొవిరి ముత్యాలమ్మలు కలసి కత్తులు, రాళ్లు, ఐరన్ రాడ్‌తో బంగారాజుపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ బంగారాజును వైద్యం కోసం గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనలో మృతుడి సోదరుడు మైలపల్లి పోలరాజు గాయపడినట్లు డీఎస్పీ చెప్పారు. మృతుడి భార్య మైలపల్లి బంగారం ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు నిందితులను పట్టుకోవడానికి ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వీరిని మడుతూరు జంక్షన్‌లో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల్ని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, అచ్యుతాపురం సీఐ గణేష్, రాంబిల్లి ఎస్ఐ నరసింగరావు, పరవాడ ఎస్ఐలు బి.కృష్ణారావు, వి.సత్యనారాయణ, సిబ్బందిని అభినందించారు. నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, ఒక ఐరన్ రాడ్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. వ్యక్తిగత కారణాలతో జరిగిన ఈ ఘటనను ఆసరాగా తీసుకుని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐలు బి.కృష్ణారావు, సత్యనారాయణ, ఏఎస్ఐ బి.ఎర్రునాయుడు పాల్గొన్నారు.

భీమిలి టీడీపీలో అసమ్మతి సెగ

- మినీ మహానాడుకు కోరాడ వర్గం డుమ్మా
- గంటా రవితేజ నోట.. జోహార్.. సీఎం సర్!


భీమిలి మినీ మహానాడులో మాట్లాడుతున్న గంటా రవితేజ, వేదికపై ఎమ్మెల్యే గంటా, కోరాడ రాజబాబు ఫొటో లేని వెనుక బ్యానర్

మధురవాడ: భీమిలి నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడులో పార్టీ నేతల మధ్య అసమ్మతి సెగ బయటపడింది. పీఎంపాలెంలోని వి కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం జరిగిన ఈ సభకు కోరాడ రాజబాబు వర్గం డుమ్మా కొట్టింది. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు కె.బాలాజీ, టీడీపీ నేతలు తొలుత దివంగత సీఎం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభాధ్యక్షత వహించిన 6వ వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు ముందుగా గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజను నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా ప్రకటించారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ ఇక్కడ ఏర్పాటవుతున్న ఐటీ పరిశ్రమల్లో స్థానిక యువతకు రిజర్వేషన్ ఇవ్వాలని కోరారు.

రాజబాబు వర్గం డుమ్మా

పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ముందుండి నడిపించిన భీమిలి టీడీపీ ఇన్‌చార్జ్ కోరాడ రాజబాబు, అతని వర్గం ఈ సభకు డుమ్మా కొట్టింది. ఆనందపురం ప్రాంత నాయకులు కూడా అరకొరగానే వచ్చారు. కొంత కాలంగా గంటా, కోరాడ మధ్య దూరం పెరిగిందన్న వార్తలకు ఈ సభ స్పష్టతనిచ్చింది. సభలో ఏర్పాటు చేసిన బ్యానర్‌లపై కూడా రాజబాబు ఫొటో ఎక్కడా కనిపించలేదు. రాజబాబును నియోజకవర్గ ఇన్‌చార్జిగా అనధికారికంగా ఇప్పటికే తప్పించినట్లు తమ్ముళ్లు గుసగుసలుపోతున్నారు. ఇప్పుడు సభలోనే గంటా రవితేజను ఇన్‌చార్జిగా ప్రకటించేశారు.

స్థానిక కమిటీలపై అసంతృప్తి

పార్టీ అభ్యున్నతికి కృషి చేసిన సీనియర్లకు గంటా వచ్చాక తగిన ప్రాధాన్యత దక్కట్లేదన్న విమర్శలున్నాయి. పదవులు, స్థానిక కమిటీల్లో కూడా వారికి చోటు దక్కలేదు. మధురవాడలో వార్డు కమిటీల ఏర్పాటు విషయంలో సీనియర్ నాయకులు అసమ్మతి ర్యాలీగా మహానాడుకు తరలి రావడం విశేషం. తమకు ప్రాధాన్యత ఇవ్వకపోతే తిరుగుబాటు తప్పదంటూ సంకేతాలు ఇస్తున్నారు.

జోహార్ సీఎం సర్!

గంటా రవితేజ తన ప్రసంగంలో జోహార్ ఎన్టీఆర్.. జోహార్ సీఎం సర్.. జోహార్ లోకేశ్‌బాబు అంటూ నినాదాలతో హోరెత్తించారు. వేదికపై ఉన్నవారితోపాటు, సభకు హాజరైన వారు అవాక్కయ్యారు. చనిపోయిన వారికి కదా జోహార్లు అర్పించేది అంటూ.. పక్కనే ఉన్న నాయకులు చెప్పడంతో.. పొరపాటున అలా అనేశానంటూ.. వివరణ ఇచ్చుకున్నారు.

భగ్గుమన్న కార్మిక సంఘాలు

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులపై ఆందోళన


ర్యాలీ చేస్తున్న కార్మికులు

బీచ్‌రోడ్డు: స్టీల్‌ప్లాంట్‌లోని కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులను తక్షణమే నిలిపివేయాలని, రాష్ట్ర ప్రభుత్వం తమ వైఖరిని స్పష్టం చేయాలని విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ప్లాంట్ నుంచి పోలీసులను వెనక్కి రప్పించాలని కూడా ఆయన కోరారు. సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, జూలై 9కి వాయిదా పడిన అఖిల భారత సమ్మెకు మద్దతుగా కాంట్రాక్ట్ కార్మికులు నేటి నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. అక్రమ తొలగింపులు, పెండింగ్ జీతాలు, హెచ్‌ఆర్‌ఏ అమలు, నాయకులపై సస్పెన్షన్ల రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రదర్శన, సభ జరిగింది. కేంద్ర బీజేపీ ప్రభుత్వం చేపట్టిన స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తీవ్రంగా ఖండించిన జేఏసీ నాయకులు, సొంత గనులు కేటాయించాలని గత నాలుగేళ్లుగా పోరాడుతున్నామన్నారు. ఎన్నికల ముందు స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని చెప్పిన రాష్ట్ర కూటమి నాయకులు, ఇప్పుడు 5,400 మంది కాంట్రాక్ట్ కార్మికులను అక్రమంగా తొలగిస్తుంటే ఎక్కడున్నారని ప్రశ్నించారు. కార్మికులను భయభ్రాంతులకు గురిచేయడం, ప్లాంట్‌లో పోలీసులను మోహరించడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో కొనసాగించడానికి, కార్మికుల ఉపాధిని రక్షించడానికి దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్, తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ కార్మికుల సమ్మెలకు సంఘీభావంగా భారీ ర్యాలీ నిర్వహించారు. జూలై 9న జరిగే అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, ఆశా, అంగన్‌వాడీ వంటి వివిధ ప్రభుత్వ పథకాల కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఆటో, ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ఈపీఎస్ పెన్షన్ దారులకు కనీస పెన్షన్ 9,000 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, సీఎఫ్‌టీయూఐ అఖిలభారత అధ్యక్షుడు కనకారావు ఇతర కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం


మృతి చెందిన బుంగా వెంకట నరసమ్మ

కశింకోట: మండలంలోని బయ్యవరం పాల డెయిరీ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఎస్ఐ లక్ష్మణరావు అందించిన వివరాల ప్రకారం...విశాఖపట్నం నుంచి నరసాపురం వెళుతున్న కారు, బయ్యవరం పాల డెయిరీ వద్ద అవతలి రోడ్డులోకి అకస్మాత్తుగా మలుపు తిరుగుతున్న లారీని వేగంగా ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న బుంగా వెంకట నరసమ్మ (72) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. కుమారుడు నరేష్, మేనకోడలు సువర్ణ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు వైద్యులు సిఫారసు చేశారు. విశాఖలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న నరేష్, తమ తల్లి నరసమ్మ, కుటుంబ సభ్యులు సువర్ణ, ముగ్గురు పిల్లలతో కలిసి కారులో పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో బంధువుల ఇంటికి పెళ్లికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. నరసమ్మ మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జయి దెబ్బతింది. తన కళ్లముందే తల్లి నరసమ్మ మృతి చెందడంతో నరేష్, కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.


కిరాణాషాపులో ఫ్రిడ్జ్ షాక్ కొట్టి విద్యార్థి మృతి


మృతుడు దశ్వంత్ (ఫైల్)

తగరపువలస: ఆనందపురం మండలం చందకలో మంగళవారం కిరాణా షాపులో పనిచేస్తున్న 6వ తరగతి విద్యార్థి రెడ్డి దశ్వంత్(13) ఫ్రిడ్జ్ డోర్ తీయడానికి ప్రయత్నించగా విద్యుదాఘాతానికి గురై దుర్మరణం చెందాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనందపురం పంచాయతీ దండువారి కళ్లాలలకు చెందిన లారీ డ్రైవర్ అయిన రెడ్డి శివ, కుమారి దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిద్దరూ ఆనందపురం ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నారు. వేసవి సెలవుల కారణంగా పెద్ద కుమారుడు చందకలో మహేష్ అనే వ్యక్తికి చెందిన కిరాణా షాపులో పని చేస్తున్నాడు. మంగళవారం కురిసిన వర్షానికి తడిసిన ఫ్రిడ్జ్‌ను తాకడంతో షాక్‌కు గురై పడిపోయాడు. అందుబాటులో ఉన్న గ్రామీణ వైద్యుని వద్దకు తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో, మధురవాడలోని గాయత్రి ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే చనిపోయినట్టు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించి, ఆనందపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తీరం.. ఎంత అబ్బురం!


ఈ నెల 15న తీరం ఇలా...


మంగళవారం తీరంలో అలల ఉధృతి

ఏయూ క్యాంపస్: సముద్రం .. నిత్యం ఆటుపోట్లు.. ప్రతి రోజూ అనేక మార్పులకు నిలయం. నిశితంగా గమనిస్తే తప్ప కొన్ని అర్థం కావు. విశాఖ సాగరతీరం ఈ నెల 15తో పోల్చితే.. మంగళవారం చాలా భిన్నంగా ఉంది. ఐదు రోజుల క్రితం కెరటాల ఉధృతి తక్కువగా ఉండగా, మంగళవారం వీటి ఉధృతి పెరిగి, ఇసుక తిన్నెలు అలల కిందకు చేరాయి. –ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం